సాక్షి రంగారెడ్డి

బుధవారం ၊ 6 ၊ సెప్టెంబర్ ၊ 2023



టికెట్‌పై పునరాలోచించాలి

చేవెళ్ల అసెంబ్లీ అభ్యర్థిత్వంపై సీఎం కేసీఆర్ పునరాలోచించాలని బీఆర్‌ఎస్‌లోని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు డిమాండ్ చేశారు. 8లో▸



సమస్యలు పరిష్కరిస్తాం

రెవెన్యూ, ఇరిగేషన్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని కలెక్టర్ హరీశ్ అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. 8లో▸



కాషాయ జెండా ఎగరేస్తాం

కల్వకుర్తి గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి ధీమా వ్యక్తం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

భక్తుల ఆరోగ్య రక్షణే ధ్యేయం

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: ఆలయానికి వచ్చే భక్తులకు ఆరోగ్య రక్షణ కల్పించడానికే ప్రాథమిక ఆరోగ్య రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్‌ఎఫ్), చిలుకూరు బాలాజీ దేవాలయం సంయుక్తంగా ఆలయం వద్ద మంగళవారం ప్రాథమిక ఆరోగ్య రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీకెండ్‌లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని.. వారికి ఆరోగ్య రక్షణ కల్పించడం తమ బాధ్యతగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మహాప్రదక్షిణలు చేసే భక్తులకు వైద్య సహాయం అందిస్తామన్నారు. అందుకోసం డాక్టర్, పారా మెడికల్ సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



ఇనాంగూడ భైరాంఖాన్ చెరువును పరిశీలిస్తున్న వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక మండప నిర్వాహకులు, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో సీఐ మన్మోహన్, ఎస్‌ఐలు కరుణాకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డితో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. అంతకు ముందు భైరాన్‌ఖాన్ చెరువును పరిశీలించి నిమజ్జనం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయాలపై చర్చించారు. అనంతరం ఏసీపీ భీంరెడ్డి మట్లాడుతూ.. గణేశ్ మండపాలను రహదారులు, రోడ్డు మీద ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నిర్మించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకొని పోలీసులకు సహకరించాలని సూచించారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: ధరలను నియంత్రించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మంగళవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలను తగ్గించాలని బుధ, గురువారాల్లో గ్రామాలు, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, మెడిసిన్ ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడి సంపాదించింది నిత్యావసర సరకులు, కూరగాయలకు సరిపోవడంలేదన్నారు. ధరలను నియంత్రించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల యాదయ్య, బోడ సామేల్, ఎం.చంద్రమోహన్, డి.జగదీశ్, డి.రాంచందర్, జగన్, ఆలంపల్లి నర్సింహా, శ్యాంసుందర్, డి.కిషన్, రావుల జంగయ్య పాల్గొన్నారు.

జోరువాన

మూడో రోజు భారీ వర్షం

- జంట జలాశయాలకు జలకళ
- పొంగిపొర్లిన వాగులు, చెరువులు
- నీట మునిగిన పంట పొలాలు
- స్తంభించిన జనజీవనం



షాబాద్: అలుగు పారుతున్న పహిల్వాన్ చెరువు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో మంగళవారం జనజీవనం స్తంభించిపోయింది. రోజంతా వర్షం కురుస్తూనే ఉండటంతో జిల్లావాసులు పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు,వంకలు పొంగి ప్రవహించాయి.రోడ్లపైకి భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటు ఎల్బీనగర్ నుంచి కొత్తగూడెం వర కు, సాగర్ రింగ్‌రోడ్డు నుంచి బీఎన్‌రెడ్డినగర్ వరకు, శ్రీశైలం జాతీయ రహదారి, ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బాపూ ఘాట్ నుంచి గండిపేట వరకు, అటు మొయినాబాద్ వరకు భారీగా ట్రాఫిక్ జాం అయింది.

మత్తడి దూకుతున్న చెరువులు

ఈసీ, మూసీ వాగులకు వరద పోటెత్తింది. జంటజలాశయాలు (ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్) ఇప్పటికే పూర్తిగా నిండిపోవడం, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో జలమండలి అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు ప్రాజెక్టులకు 12 గేట్లు ఎత్తి, వచ్చిన నీరు వచ్చినట్లే (5,500 క్యూసెక్కులు) కిందికి వదులుతున్నారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు సహా తుర్కయంజాల్ మాసబ్ చెరువు మళ్లీ అలుగు పోస్తున్నాయి. వరదనీరు కాలనీలను ముంచెత్తడంతో ప్రజలు ఇబ్బందిపడాల్సి వస్తోంది.

బిక్కుబిక్కుమంటున్న జనం

వరదనీరు పంట చేలను ముంచెత్తింది. ఫలితంగా మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి తదితర ప్రాంతాల్లోని కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్ల తోటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. పలు సబ్‌స్టేషన్లలోని ఫీడర్లు ట్రిప్పయ్యాయి. లైన్ల మధ్య చెట్ల కొమ్మలు విస్తరించి ఉండటం, ఈదురుగాలితో కూడిన వర్షానికి కొమ్మలు లైన్లను ఆనుకోవడంతో షార్ట్ సర్క్యూట్ తలెత్తింది. జిల్లా వ్యాప్తంగా వందకు పైగా ఫీడర్లు ట్రిప్‌పెన్నైట్లు తెలిసింది. కొన్నిచోట్ల అరగంటలో విద్యుత్‌ను పునరుద్ధరించగా, మరికొన్ని చోట్ల అర్ధరాత్రి తర్వాత కూడా అంధకారం తప్పలేదు.



చేవెళ్ల: ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు



మొయినాబాద్ రూరల్: నీట మునిగిన గులాబీ తోట

మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు వర్షపాతం (సెంటీమీటర్లలో)

గండిపేట	8.93
శేరిలింగంపల్లి	8.93
శంకర్‌పల్లి	8.78
మహేశ్వరం	7.41
బాలాపూర్	7.20
రాజేంద్రనగర్	6.99
శంషాబాద్	6.58
చేవెళ్ల	6.44
కొందుర్గు	6.30
చౌదరిగూడెం	5.93
హయత్‌నగర్	5.78
సరూర్‌నగర్	5.40
మొయినాబాద్	5.32
షాబాద్	4.19
అబ్దుల్లాపూర్‌మెట్	4.02
ఇబ్రహీంపట్నం	4.02
కందుకూరు	4.00
ఫరూఖ్‌నగర్	3.98
నందిగామ	3.65
ఆమనగల్లు	3.55
కొత్తూరు	3.48
కేశంపేట	2.73
మంచాల	2.64
యాచారం	2.40
కడ్తాల్	2.39
మాడ్గుల	1.71
తలకొండపల్లి	1.01

రెయిన్ అలర్ట్!

- భారీ వర్షాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం
- కీలక నాలాలు, వాటర్ లాగింగ్ ఏరియాలపై దృష్టి
- అవాంఛనీయ ఘటనలు లేకుండా అవసరమైన చర్యలు
- సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన ఉన్నతాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీసు విభాగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ సహాయక చర్యల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటు శాంతిభద్రతల విభాగం అధికారులూ పాల్గొంటున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నగరంలో ప్రధానంగా రెండు అంశాలు ఆందోళన కలిగిస్తాయి. నగర వాసుల్ని అమాంతం మింగేసే నాలాలు ఒక ఎత్తైతే.. రోడ్డుపై ఎక్కడికక్కడ ఆగిపోయే వాహనాలు మరో ఎత్తు. ఈ రెంటితో పాటు కాలనీలను ముంచెత్తే వరద నీరు అటు జీహెచ్‌ఎంసీతో పాటు ఇటు పోలీసు విభాగానికీ సవాల్ విసురుతుంది. ఈ మూడింటినీ దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు.

- ఠాణాల వారీగా తమ పరిధిలో ఉన్న కీలక, ప్రధానమైన నాలాలపై నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.
- జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలో దాదాపు అన్ని నాలాలకు ఫెన్సింగ్ నిర్మించారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ నిర్మాణాలు జరగలేదు. మరోపక్క కొన్ని నాలాలు, నాలా వంతెనలపై ఉన్న పాత ఫెన్సింగ్ దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతాలను గుర్తించడంతో పాటు అక్కడ నిఘా ఏర్పాటు చేస్తున్నారు.
- అత్యవసరమైన చోట ప్రజలు అటు వైపు వెళ్ళకుండా తాత్కాలిక బారికేడింగ్ వేస్తున్నారు. ఆయా ప్రాంతాల వివరాలను స్థానిక జీహెచ్‌ఎంసీ అధికారులకు తెలపడం ద్వారా సమస్య పరిష్కారమయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు.
- వర్షాల నేపథ్యంలో వాటర్ లాగింగ్ ఏరియాలతో భారీ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. కొన్ని చోట్ల నీటిలో వాహనాలు ఆగిపోతున్నాయి. ఈ రెండూ వాహనచోదకులకు నరకాన్ని చవి చూపించే అంశాలే.
- ట్రాఫిక్ జామ్స్, వాటర్ లాగింగ్ ఏరియాల క్లియరెన్స్ అంశాల్లో ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని శాంతిభద్రతల విభాగం అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.
- వర్షాలు కురిస్తే నగరంతో పాటు శివార్లలోని అనేక ప్రాంతాలు జలమయం అవుతాయి. కొన్ని కాలనీలు చెరువుల్ని తలపించి వాటితో బయటి ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతాయి. గతంలో వర్షాలు కురిసినప్పుడు ఇలా మారిన ప్రాంతాల జాబితాలను పోలీసులు సిద్ధం చేశారు. ఆ ఏరియాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.
- నీట మునిగిన చోట్ల నుంచి స్థానికులను బయటకు తరలించడం, అక్కడే ఉన్న వారికి సహాయసహకారాలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే శివార్లలోని అనేక చోట్ల పోలీసు విభాగం సహాయకచర్యలు చేపడుతోంది. వర్షాల ముప్పు తప్పే వరకు ప్రతి అధికారి కచ్చితంగా అందుబాటులో ఉండాలని, సర్వకాలసర్వావస్థల్లోనూ విధులకు హాజరుకావాలని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.



వర్షానికి జలమయమైన ఓ కాలనీ

వీధి కుక్కల స్వైరవిహారం





కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన రమావత్ ద్వాలి, బాలుడు శంకర్

- వృద్ధురాలు, బాలుడిపై దాడి
- చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలింపు

యాచారం: వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఓ వృద్ధురాలు, బాలుడిపై దాడికి పాల్పడ్డాయి. వివరాలివీ.. మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు రమావత్ ద్వాలి, పదేళ్ల బాలుడు శంకర్ మంగళవారం మధ్యాహ్నం ఓ కాలనీ నుంచి నడిచి వారి ఇళ్లకు వెళ్తున్నారు. అకస్మాత్తుగా వీధి కుక్కలు వారిపై దాడి చేసి గాయపర్చాయి. ఇద్దరికీ తీవ్ర రక్తస్రావం జరిగింది. దాడిలో గాయపడిన ఇద్దరూ స్పృహతప్పి పడిపోయారు. గమనించిన గ్రామస్తులు కుక్కలను తరిమేసి 108 అంబులెన్స్‌లో ఇద్దరినీ యాచారం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించిన వైద్యులు ద్వాలి పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. బాలుడిని నారాయణగూడ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, గ్రామంలో చికెన్ దుకాణ వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను సమీపంలోనే పడేస్తారు. వీటికి అలవాటు పడిన వీధి కుక్కలు మనుషులు, పశువులపై తరచూ దాడులకు పాల్పడుతున్నాయి. వ్యాపారులు కోళ్ల వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేయకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అయ్యో.. ఆదిత్య

- పిచ్చి కుక్క కరిచిన బాలుడి దుర్మరణం
- రేగడిమైలారంలో విషాదం
- భయాందోళనలో కుక్క కాటు బాధితులు

బొంరాస్‌పేట: పిచ్చికుక్క దాడిలో 25 రోజుల క్రితంతీవ్రంగా గాయపడిన చిన్నారి మంగళవారం మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆగస్టు 10న బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో ఓ కుక్క స్వైరవిహారం చేసింది. 2 గంటల వ్యవధిలో 12మందిని కరిచి గాయపర్చింది. వీరిలో ఏడుగురు చిన్నారులు కాగా ఐదుగురు పెద్దవాళ్లు ఉన్నారు. ఇందులో తీవ్రంగా గాయపడిన ఆరుగురిని నగరంలోని నల్లకుంట ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మిగిలిన వారిని వికారాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి పంపించారు. వీరిలో ఆరుగురు చిన్నారులు ప్రస్తుతం మందులు వాడుతున్నారు. ఇదిలా ఉండగా ఆరోజు ఘటనలో తీవ్రంగా గాయపడిన నెల్లి అనురాధ, శ్రీనివాస్‌ల కుమారుడు ఆదిత్య(5) సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు మంగళవారం ఉదయాన్నే ఆస్పత్రికి తరలిస్తుండగా ఆరోగ్యం విషమించి మార్గమధ్యలోనే మృతిచెందాడు. బాధితులకు వర్షిత, ఆదిత్య ఇద్దరు సంతానం. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఆదిత్య మృతితో మిగిలిన చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చికుక్కగాటు బాధితులకు ఉరుములు, మెరుపుల వాతావరణం పడదని పెద్దలు చెబుతున్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆదిత్య మృతదేహం

స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో ప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన వాహనం

- ఎనిమిది మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- బాధితులంతా బిహార్‌వాసులే..

కొందుర్గు: స్కాన్ ఎనర్జీ (ఐరన్) పరిశ్రమలో మంగళవారం చోటు చేసుకున్న పేలుడులో పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మండుతున్న బట్టీ అనుకోకుండా పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్ని జ్వాలలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెండు లారీలపై పడటంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో వాహనం పాక్షికంగా కాలిపోయింది. ప్రమాదంలో మొత్తం ఎనిమిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రమాదంలో గాయపడ్డ బిహార్‌కు చెందిన రాజీవ్‌యాదవ్, రాజ్‌నారాయణ్, లాల్‌బాబు, మహిమూద్ తదితరులు షాద్‌నగర్ పట్టణంలోని శివరామ్‌నాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన నలుగురిని దివ్య ఆస్పత్రిలో చేర్పించినట్లు సమాచారం. కొందుర్గు ఎస్‌ఐ కృష్ణయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో చాలా మంది కార్మికులకు గాయాలై ఉంటాయని, విషయం బయటకు పొక్కకుండా యాజమాన్యం జాగ్రత్త పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



చికిత్స పొందుతున్న కార్మికుడు

విద్యార్థుల కలలను సాకారం చేయాలి



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంత్రి సబితారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీఈఓ సుశీందర్ రావు



ఇబ్రహీంపట్నం: రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న పొగాకు సురేష్

- ఆ బాధ్యత ఉపాధ్యాయులదే
- ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలి
- ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి
- 'ఉత్తమ' గురువులకు సన్మానం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యార్థుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత గురువులదేనని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 164 మందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థి ప్రపంచంతో పోటీ పడేలా తయారు కావాలన్నదే సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయన్నారు. ప్రైవేటు కన్నా ప్రభుత్వ స్కూళ్లలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, వారంతా అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. మన ఊరు–మనబడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని గుర్తు చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో 10 జీపీఏలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆ దిశగా కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ హరీశ్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, కాలె యాదయ్య, జెడ్పీ చైర్ పర్సన్ డాక్టర్ అనితారెడ్డి, డీఈఓ సుశీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

48 గంటలైనా దొరకని ఆచూకీ

ఆందోళనలో లక్ష్మి కుటుంబ సభ్యులు



లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: కవాడిగూడ డివిజన్ పరిధిలోని దామోదరం సంజీవయ్య నగర్ బస్తీకు చెందిన లక్ష్మి అనే మహిళ నాలాలో గల్లంతై 48 గంటలు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక ప్రాంతంలో రిటర్నింగ్ వాల్ నిర్మించకపోవడంతో గల్లంతైన మహిళ నాలాలో నిచ్చెన సాయంతో కిందకి దిగి కాలకృత్యాలు తీర్చుకునేదని స్థానికులు చెబుతున్నారు. కాలకృత్యాల కోసం వెళ్లినప్పుడే గల్లంతై ఉండొచ్చని సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న నాలా పరివాక ప్రాంతమంతా గాలించినా ఆచూకీ లభించలేదని గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. బుధవారం సూర్యాపేట, చౌటుప్పల్ ప్రాంతాల్లోనూ గాలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దేవాలయాల అభివృద్ధికి చర్యలు

దేవాదాయశాఖ ఎస్‌ఈ మల్లికార్జున్‌రెడ్డి

షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని దేవాదాయశాఖ ఎస్‌ఈ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పరిధి రామేశ్వరం గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయానికి రూ.5కోట్లు, ఎలికట్ట అంబాభవాని దేవాలయానికి రూ.2కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధిపై మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, స్థపతి వల్లినాయగం, ఈఈ నరేందర్‌తో చర్చించారు. ఎలికట్ట అంబాభవాని దేవాలయానికి రాతితో పూర్తి స్థాయిలో కాంపౌండ్ వాల్ నిర్మాణం, రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయానికి రాజగోపురం, ప్రాకార మండపం నిర్మించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధితో పాటు దూపదీప నైవేద్యాల కోసం నిధుల కేటాయించడం, అర్చకులకు వేతనాల రెట్టింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. త్వరలో ఆలయాల అభివృద్ధి పనులకు టెండర్లను పిలవనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అనంతరం రామేశ్వరం దేవాలయంలో ఎస్‌ఈ మల్లికార్జున్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, ఎలికట్ట, రామేశ్వరం ఆలయ చైర్మన్లు కృష్ణయ్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



అభివృద్ధిపై ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో చర్చిస్తున్న దేవాదాయశాఖ ఎస్‌ఈ మల్లికార్జున్‌రెడ్డి

మహేశ్వరం టికెట్ కేటాయించండి

పీసీసీ ఉపాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: పార్టీ బలోపేతానికి 35 ఏళ్లుగా పనిచేస్తున్న తనకు మహేశ్వరం అసెంబ్లీ టికెట్ కేటాయించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత ఎల్మేటి అమరేందర్‌రెడ్డి సీడబ్ల్యూసీ నంబర్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. బాలాపూర్‌కు చెందిన ఆయన మంగళవారం ఉత్తమ్‌కుమార్ రెడ్డికి దరఖాస్తు అందజేశారు. అనంతరం ఎలక్షన్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైనందున ఆయనకు అభినందనలు తెలిపారు. గతంలో నియోజకవర్గం నుంచి పోటీ చేసినా ఓడినా పార్టీ పటిష్టానికి నిరంతరం శ్రమించానని చెప్పారు. బాలాపూర్ మండలంలోని ముస్లిం ఏరియాలో ఓటు బ్యాంక్ ఉందని.. సరూర్‌నగర్, ఆర్‌కే పురం, మీర్‌పేట్, బడంగ్‌పేట కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు, కందుకూరు, మహేశ్వరం మండలాల్లోనూ గట్టి పట్టు ఉందని వివరించారు. అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి సీనియారిటీ తదితర అంశాల ప్రకారం ప్రయారిటీ ఉంటుందని వివరించారని ఎల్మేటి వివరించారు.


ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి దరఖాస్తు అందజేస్తున్న ఎల్మేటి అమరేందర్‌రెడ్డి

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా 'మోడల్' ప్రిన్సిపాల్

అవార్డు ప్రదానం చేసిన మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, హోం మంత్రి మహమూద్ అలీ ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సురభివాణి, రఘోత్తంరెడ్డి, ఏవీఎన్‌రెడ్డి, ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దేవసేన పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న ధనుంజయ్

ఔటర్ పక్కన కూలిన బండరాయి

మణికొండ: భారీ వర్షం కారణంగా మంగళవారం ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఓ గుట్ట కూలింది. నార్సింగి నుంచి పోలీస్ అకాడమీకి వెళ్లే సర్వీసు రోడ్డును ఆనుకుని బండరాళ్లతో కూడిన చిన్న గుట్ట ఉంది. ఈ గుట్టలోని ఓ పెద్ద బండరాయి అకస్మాత్తుగా కిందకు పడిపోయింది. అయితే పూర్తిగా సర్వీసు రోడ్డుపైకి పడకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అటుగా వెళ్లే వారు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ వదులుగా ఉన్న కొండను తొలగించాలని, లేకుంటే మరోసారి అది వాహనాలపై పడే ప్రమాదం పొంచిఉందని వాహనదారులు పేర్కొన్నారు.

'చేవెళ్ల' టికెట్‌పై పునరాలోచించాలి

యాదయ్యకే టికెట్ ఇస్తే ఓడిస్తాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు

చేవెళ్ల: నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిత్వంపై సీఎం కేసీఆర్ పునరాలోచించాలని బీఆర్‌ఎస్‌లోని ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు డిమాండ్ చేశారు. మంగళవారం చేవెళ్లలో మొయినాబాద్ మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ భాస్కర్, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు మోహన్‌గౌడ్, యాదయ్య, సర్పంచ్ కె.రత్నం, సీనియర్ నాయకులు నీలకంఠం, హన్మంత్‌యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఎన్నికైన కాలె యాదయ్య చేయని అక్రమాలు లేవని ఆరోపించారు. ఆయనకు మరోమారు బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని.. ఆయనకే టికెట్ కేటాయిస్తే పార్టీకి నష్టం జరగడం ఖాయమన్నారు. రెండుసార్లు గెలిపిస్తే ఆయన చేసిందేమీ లేకపోగా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. మొయినాబాద్ మండలంలో ప్రతీ వెంచర్‌లో ఒక ప్లాటు, డబ్బులు డిమాండ్ చేసిన చరిత్ర ఎమ్మెల్యేదన్నారు. మండలంలోని నాయకులను ఎదగనీయకుండా రిజర్వ్‌డ్ స్థానంలో ఆయన కొడుకు నిలబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన కూడా తండ్రి బాటలో నడుస్తూ పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి సైతం డబ్బులు డిమాండ్ చేసిన ఆధారాలున్నాయని చెప్పారు. కేఎస్ రత్నంకు టికెట్ కేటాయిస్తే గెలుపు బాధ్యతను తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మొయినాబాద్ మండల నాయకులు ఆనంద్, జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, రాజు, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మణ్, శ్యాంసుందర్, హరినాథ్, రాంచందర్, రాజు, శంకరయ్య, కిషన్, మహేందర్, ప్రశాంత్, ప్రమోద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం

వారించినా వినకుండా..


నీటి ప్రవాహంలో వంతెన దాటుతున్న రమేశ్

ధారూరు: ఎంతమంది వారించినా వినకుండా ఓ వ్యక్తి ప్రాణాలకు తెగించి వాగు దాటాడు.. ఈ సంఘటన మంగళవారం నాగసమందర్ – రుద్రారం గ్రామాల మధ్య వంతెన వద్ద చోటుచేసుకుంది. నాగసమందర్ గ్రామానికి చెందిన రమేశ్ పని నిమిత్తం ధారూరుకు వచ్చి వెళ్తున్నాడు. కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారుతుండడంతో నాగసమందర్ – రుద్రారం మధ్య వంతెన పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే రమేశ్ వాగు దాటేందుకు యత్నించగా పలువురు వద్దని హెచ్చరించారు. అయినా వినకుండా ముందుకెళ్లాడు. ఒక దశలో జారి పడే పరిస్థితి ఎదురైంది. తడబడుతూ.. భయంగా వాగు దాటేశాడు. దీంతో అక్కడి వారు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అక్కడే గస్తీ ఉన్న పోలీసులు కూడా చెప్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం

కలెక్టర్ హరీశ్

హయత్‌నగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో నెలకొన్న రెవెన్యూ, ఇరిగేషన్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ హరీశ్ అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మన్సూరాబాద్ 93/1లో రెండు ఎకరాల భూమి కబ్జాకు గురైందని దానిని సర్వే చేయించాలని, లింగోజిగూడ గ్రీన్‌పార్కు కాలనీలో నాలా కోసం ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ఇంత వరకు నివేదిక ఇవ్వలేదని వెంటనే ఇప్పించాలని, జీఓ 118 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బందులు ఎదరవుతున్నాయని వాటిని పరిష్కరించాలని, అన్మగల్ సర్వే నెంబర్ 255లో రైతుల నుంచి గతంలో హెచ్‌ఎండీఏ అధికారులు భూమిని తీసుకుని అభివృద్ధి చేస్తామని ఎలాంటి అభివృద్ధి చేయలేదని రైతులకు వారి భూములను వారికిచ్చి సాగు చేసుకునేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.. ధాతునగర్ కాలనీలో యూఎల్‌సీ భూములపై తుది నిర్ణయం తీసుకోవాలని, నందనవనం డబుల్ బెడ్రూం ఇళ్లలో అర్హులైన లబ్దిదారులు ఉంటున్నారని ఈ ఇండ్ల కేటాయింపునకు లాటరీ తీయకూడదని మ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానికుల అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై అధికారులతో విచారణ చేయించి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, హయత్‌నగర్, సరూర్‌నగర్ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్ హరీశ్

కాషాయ జెండా ఎగరేస్తాం

బీజేపీ సీనియర్ నేత ఆచారి

తలకొండపల్లి: కల్వకుర్తి గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ సీనియర్ నేత తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ మండల అధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికీ బీజేపీ–గడప గడపకు మోదీ సంక్షేమ పథకాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని సంఘాయిపల్లి, చంద్రధన, చౌదర్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనతో విసుగెత్తిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. తాను 40 ఏళ్లుగా ఎత్తిన జెండాను వదలకుండా ప్రజలకోసం పనిచేస్తున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, బీజేపీ జిల్లా కార్యదర్శి పాండు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ బక్కి కుమార్, కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, అధికార ప్రతినిధి శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గ్రామాల్లో పర్యటిస్తున్న ఆచారి

'నందు ఆర్మీ'తో భవిష్యత్‌కు మార్గం


ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

- జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేష్‌గుప్తా
- అకాడమీ నుంచి ఉద్యోగాలు సాధించిన 60 మంది ఎస్‌ఐలకు సన్మానం

హుడాకాంప్లెక్స్: నందు ఆర్మీ అకాడమీ భవిష్యత్‌కు మార్గం చూపుతుందని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌గుప్తా అన్నారు. టీఎస్‌పీఎల్‌ఆర్‌బీ విడుదల చేసిన ఫలితాల్లో ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైన 62 మంది అభ్యర్థులను నందు ఆర్మీ అకాడమీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించిన ప్రతీ ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకుని, జ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే విజయం సాధించగలుగుతామన్నారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం నందు ఆర్మీ అకాడమీ డైరెక్టర్ నందునాయక్ మాట్లాడుతూ.. తమ అకాడమీలో దాదాపు 2వేల మంది శిక్షణ తీసుకున్నారని, ప్రభుత్వం ప్రకటించిన 500 ఎస్‌ఐ పోస్టులలో తమ దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు 62 మంది ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, సర్పంచ్ గోపాల్‌నాయక్, కానిస్టేబుల్ తావురియా నాయక్, సరూర్‌నగర్ ఎస్‌ఐలు లక్ష్మణ్, రమేశ్, మాధవన్, అకాడమీ కో ఆర్డినేటర్ వెంకటేశ్, శిక్షకులు సిరి పాల్గొన్నారు.

రారెత్తిస్తున్న క్యాబ్‌లు, ఆటోలు

- వర్షం కారణంగా బుకింగ్‌లలో తీవ్ర జాప్యం
- రెట్టింపు చార్జీలు వసూలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- వరదలు ముంచెత్తడంతో తగ్గిన సిటీబస్సులు
- మెట్రో రైళ్లకు భారీ డిమాండ్



సాక్షి, సిటీబ్యూరో: ఆటోలు, క్యాబ్‌లు ప్రయాణికులను రారెత్తిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆటోవాలాలు, క్యాబ్‌వాలాలు చార్జీలను రెట్టింపు చేసి ప్రయాణికులపైన నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. మరోవైపు బుకింగ్‌లలోనూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది. అత్యవసర పరిస్థితుల్లో క్యాబ్‌లను ఆశ్రయించే వారు గంటల తరబడి పడిగాపులు కాయవలసి వస్తోంది. చివరి నిమిషంలో క్యాబ్ బుక్ అయినా డబుల్ చార్జీలు చెల్లించుకోవలసి వస్తోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే నగరంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో అనేక చోట్ల రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజారవాణా అస్తవ్యవస్థమైంది. పలు మార్గాల్లో సిటీ బస్సుల రాకపోకలకు సైతం అంతరాయం కలిగింది. దీంతో ఉదయాన్నే విధులకు వెళ్లవలసిన ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రయాణికులు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించారు. సాధారణ రోజుల్లో తార్నాక నుంచి సికింద్రాబాద్‌కు ఆటోలో వెళ్లేందుకు రూ.120 కంటే ఎక్కువ ఉండదు. కానీ మంగళవారం ఏకంగా రూ.250 వరకు చెల్లించవలసి వచ్చినట్లు రమేష్ అనే ప్రయాణికుడు తెలిపారు. బోడుప్పల్ నుంచి ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు ఓలా ఆటో సాధారణంగా అయితే రూ.60 నుంచి రూ.80కి లభిస్తుంది. కానీ వర్షం కారణంగా ఏకంగా రూ.150 దాటింది. ఇక సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట్, తదితర రైల్వేస్టేషన్‌లకు చేరుకున్న దూరప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంటల తరబడి ప్రయాణం చేసి నగరానికి చేరుకున్న వాళ్లు ఇళ్లకు వెళ్లేందుకు సిటీబస్సులు, ఎంఎంటీఎస్‌లు అందుబాటులో లేక ఇబ్బంది పడాల్సి వచ్చింది.

అమాంతంగా పెరిగిన క్యాబ్ చార్జీలు...

సాధారణ రోజుల్లోనే ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్ పేరిట క్యాబ్ సంస్థలు అడ్డగోలుగా చార్జీలు పెంచేస్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో క్యాబ్‌ల కొరతను సాకుగా చూపుతూ చార్జీలను రెట్టింపు చేశారు. తార్నాక నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 వరకు సాధారణ రోజుల్లో రూ.450 నుంచి రూ.500 వరకు ఉంటే మంగళవారం ఇది రూ.870 కి చేరినట్లు ఒక ప్రయాణికుడు విస్మయం వ్యక్తం చేశారు. ఐటీ నిపుణులు, ఉద్యోగులు, ఉదయం పూట ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వెళ్లే ఉద్యోగుల ఒత్తిడి కారణంగా క్యాబ్‌లకు డిమాండ్ పెరిగింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అమీర్‌పేట్ వరకు రూ.1650 వరకు వసూలు చేసినట్లు ఒక ప్రయాణికురాలు విస్మయం వ్యక్తం చేశారు. సాధారణ రోజుల్లో రూ.వెయ్యి లోపే ఉంటుందన్నారు.

మెట్రో కిటకిట...

మెట్రో రైళ్లకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. వర్షం దృష్ట్యా చాలామంది మెట్రో రైళ్లను ఆశ్రయించారు. నాగోల్–రాయదుర్గం, ఎల్‌బీనగర్–మియాపూర్ రూట్‌లలో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ఉదయం, సాయంత్రం ఎక్కువ మంది మెట్రోలపైన ఆధారపడి ప్రయాణం చేశారు. దీంతో రెండు రోజులుగా ప్రయాణికుల సంఖ్య సుమారు 5.50 లక్షలకు చేరినట్లు అంచనా. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ఎల్‌బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గం రూట్‌లలో ప్రతి 3 నిమిషాలకు ఒకటి చొప్పున రైళ్లను నడిపారు. కొన్ని రైళ్లను రాయదుర్గం నుంచి మెట్టుగూడ వరకు నడపడంతో తక్కువ సమయంలో ఎక్కువ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల రద్దీని ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు సర్వీసులను పెంచినట్లు తెలిపారు.

'ఆరోగ్య రథం' అభినందనీయం

మైలార్‌దేవ్‌పల్లి: పేద ప్రజల ఆరోగ్యం కోసం తోకల ఆరోగ్య రథాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. ఆయుష్మాన్ భారత్ స్ఫూర్తితో ఆయుష్మాన్ రాజేంద్రనగర్‌లో భాగంగా మంగళవారం బొంగులూరు గేట్ జంగారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన తోకల ఆరోగ్య రథాన్ని కిషన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య రథాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యం ఖరీదు అయిపోయిందని, పేదలు వైద్యం చేయించుకునే పరిస్థితులు లేవన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవాలంటే అది ధనవంతులకే సాధ్యమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో ప్రధాని జన్ ఆరోగ్య యోజనలో భాగంగా ఎన్నో కార్యక్రమాలు పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. ఆరోగ్య భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. మాజీ ఎంపీ బుర్ర నర్సయ్యగౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌రాజ్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి కొమురయ్య, వెంకటయ్య, లక్ష్మమ్మయ్య, డివిజన్ ప్రెసిడెంట్ అడికె జనార్దన్, సర్పంచ్ చంద్రయ్య, మండల ప్రెసిడెంట్ మహేష్‌యాదవ్, బండ్లగూడ మున్సిపల్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌స్వామి, ప్రశాంత్, శ్రీకాంత్‌ముదిరాజ్, శివగౌడ్, మల్లికార్జున్, డాక్టర్లు, వైద్యులు సమత, సంతోష్, దీపక్‌శర్మ, పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, లవ్‌రెడ్డి, చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.